మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి

మేధాశక్తిని పెంపొందించేందుకు 'బ్రెయిన్ జాప్'

- ట్రినిటి విద్యాసంస్థల ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి కమాన్, జనవరి 19 : విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించేందుకు బ్రెయిన్ జాప్ పోటీ పరీక్ష నిర్వహించినట్లు ట్రినిటి విద్యాసంస్థల ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. ట్రినిటి గ్రూప్ ఆఫ్ స్కూల్ ఆధ్వర్యంలో పెద్దపల్లి ట్రినిటీ (సీబీఎస్ఈ) స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన బ్రెయిన్ జాప్ పరీక్షకు విశేష స్పందన లభించిందన్నారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన మనోహర్‌రెడ్డి విద్యార్థులతో మాట్లాడారు. 3 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు గణితం, సైన్స్ సబ్జెక్టులపై 100 మార్కుల పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే పోటీ పరీక్షల్లో పాల్గొంటే, వారిలో పరీక్షలపై భయాందోళనలు తొలగిపోతాయని చెప్పారు. 'బ్రెయిన్ జాప్' పరీక్షలో అత్యుత్తమ మార్కులు సాధించిన విజేతకు గణతంత్ర వేడుకల్లో రూ. 50వేలు నగదు ప్రోత్సాహం అందజేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు మంచిర్యాల, వరంగల్, హన్మకొండ తదితర ప్రాంతాల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. విద్యా సంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇక్కడ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పెద్దాపూర్‌లోని చార్లబోరులో మట్టి తవ్వుతున్న యంత్రాలు

మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

జూలపల్లి, జనవరి 19 : మండలంలోని పెద్దాపూర్ శివారులో మట్టి తవ్వకాలపై చర్యలు తీ సుకోవాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంకెండ్ల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. దాదాపు 8 రోజులుగా కొంతమంది విచ్చల విడిగా మట్టి తవ్వకాలు చేపట్టి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని ఆరోపించారు. కోనరావుపేటలో నిర్మిస్తున్న ప్రైవేట్ ప్లాస్టిక్ కంపెనీకి టిప్పర్ల ద్వారా మట్టి రవాణా చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి పనులకు మట్టి తరలిస్తే, అప్పటి కాంగ్రెస్ నాయకులు అప్పటి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మట్టి అమ్ముకుంటున్నారని దుష్ప్రచారం చేశారన్నారు. కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే అక్రమాల తవ్వకాల కు చెక్ పెట్టి నిజాయితీ నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతో క్రమ క్రమంగా సహజ వనరులు ఉనికి కోల్పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మృతి

జాకీర్ హుస్సేన్(ఫైల్)

పెద్దపల్లి టౌన్, జనవరి19: పెద్దపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జాకీర్‌హుస్సేన్ (60) ఆదివారం మృతి చెందాడు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పని చేశాడు. కొంత కాలంగా ఆనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే పరిమితమయ్యారు. మృతి చెందిన విషయం తెలియడంతో స్నేహితులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు జాకీర్‌హుస్సేన్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్థివ దేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ కౌన్సిలర్ భూతగడ్డ సంపత్, నాయకులు సయ్యద్ మస్రత్, న్యాయవాది ఉప్పు రాజు ఉన్నారు.

21 నుంచి లబ్ధిదారుల ఎంపికకు సభలు

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్

పెద్దపల్లి, జనవరి19: ఈనెల 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల మంజూరుకు ఈనెల 21 -23 వరకు సభలు నిర్వహిస్తాని తెలిపారు. పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం వార్డు ఆఫీసర్లు, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఆయా పథకాలకు సమగ్ర సర్వే ద్వారా 884, మీ సేవ ద్వారా 1675 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వార్డు సభలో పేర్లు రానట్లయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వారు వార్డు సభలో మున్సిపల్ సిబ్బందికి గాని, మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు జారీ నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. ఈనెల 21న ఉదయం 1,7, 13, 19,25,31 వార్డులు, మధ్యాహ్నం 2,8, 14,20,26,32 వార్డులు, 22న ఉదయం 3,9,15,21,27,33 వార్డులు, మధ్యాహ్నం 4,10,16,22,28, 34 వార్డులు, 23న ఉదయం 5,11,17,23,29,35 వార్డులు, మధ్యాహ్నం 6,12,18,24, 30, 36 వార్డుల్లో సభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ మేనేజర్లు శివప్రసాద్, అలీం, పెద్దపల్లి ఏఈ సతీశ్, టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, అకౌంటెంట్ నాగవేణి, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో పోలీస్ భవన సముదాయం

- 15 ఏండ్లుగా నివాసాలకు దూరం..
- పగుళ్లు పడిన భవనాలు.. అడవిని తలపిస్తున్న సముదాయం..
- కరువైన నిర్వహణ

జూలపల్లిలో పూర్తిగా శిథిలమైన పోలీస్ గృహ సముదాయం

జూలపల్లి, జనవరి 19 : మండల కేంద్రంలోని పోలీసుల నివాస గృహాలు శిథిలావస్థకు చేరాయి. ఏండ్ల తరబడి భవనాలు నిరుపయోగంగా ఉండడంతో ప్రస్తుతం అవి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. కనీసం మరమ్మతు చేపట్టకపోవడంతో ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. పెచ్చులూడుతున్న గదులపై కప్పులు, తేలిన ఇనుప రాడ్లు, పగుళ్లు బారిన గోడలు దర్శనమిస్తున్నాయి. గదులకు అమర్చిన కిటికీలు, తలుపులు ఊడిపోతున్నాయి. ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు, చెట్లు ఏపుగా పెరిగి చిట్టడవిలా తలపిస్తున్నాయి. ఏండ్ల తరబడి నిర్వహణ కరువైంది. గృహాల నిర్వహణపై నిర్లక్ష్యపు నీడ ఆవరించింది. క్వార్టర్లు నివాసాలకు అనుకూలంగా లేకపోవడంతో పోలీస్ అధికారులు, సిబ్బంది జూలపల్లి, చొప్పదండి, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాల్లో ఉంటూ ఇక్కడికి వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. గతంలో పోలీస్ భవన సముదాయం నిర్మించడానికి ఇక్కడ ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేవు. దీంతో పోలీస్ స్టేషన్ తోపాటు, గృహాలు నిర్మించుకోడానికి రైతులు ఏకమై ఎకరం స్థలం సేకరించి అప్పగించారు. ఈ క్రమంలో పోలీసులు పని చేసే చోట నివాసం ఉంటూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేలా పక్కా భవనాలు నిర్మించారు. 1991లో మౌలిక వసతులు కల్పించి ఠాణా భవనం, మీటింగ్ హాల్, ఎస్ఐతోపాటు, 20 మంది పోలీసులకు నివాస గృహాలు నిర్మించి, చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారు. దాదాపు 15 ఏండ్ల నుంచి ఠాణా భవనం, గృహ సముదాయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నది. రావి, తుమ్మ, వేప, ఈత చెట్లు ఎదిగి, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు, చెత్తా, చెదారంతో నిండి అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఆ నివాసాల్లోకి పాములు, తేళ్లు, గబ్బిలాలు చేరుతూ ఆవాసాలుగా మార్చుకున్నాయి. రాత్రి సమయాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు కనీసం విశ్రాంతి తీసుకోడానికి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి భవన సముదాయం బాగు చేయించడానికి శ్రద్ధ తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేశారు.

జూలపల్లి పోలీస్ గృహ సముదాయం ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్లు

'ఖని'లో పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పరుగు పందెంలో పాల్గొన్న మహిళా పోలీసులు

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 19: తెలంగాణ రాష్ట్రస్థాయి గేమ్స్‌అండ్ స్పోర్ట్స్ మీట్ పోటీలు గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కాళేశ్వరం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు పోటీలను ప్రారంభించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్, కుమ్రం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పోలీసు టీమ్‌లు హాజరయ్యాయి. షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, టగ్ ఆఫ్ వార్, హై జంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్, అథ్లెటిక్స్‌లో క్రీడాకారులు తలపడ్డారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాజు మాట్లాడారు. పోలీసు సిబ్బందికి క్రీడా పోటీలు నూతనోత్సాహాన్ని నింపుతాయన్నారు. ఇక్కడ గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్ రావు, ఆర్ ఐలు దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి, మల్లేశం, సంపత్, ములుగు ఆర్ఐ సంతోశ్‌కుమార్ ఉన్నారు.

శ్మశాన వాటికలో అన్ని వర్గాలకు హక్కు

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 19: ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఎల్కలపల్లి శ్మశాన వాటికలో అన్ని వర్గాల ప్రజలకు హక్కులు ఉంటాయని అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మారం తిరుపతి యాదవ్, రాష్ట్ర కౌన్సిల్‌మెంబర్ శిలారపు పర్వతాలు యాదవ్, జీకేఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పరి శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఎల్కలపల్లిలో గ్రామ పెద్దలతో కలిసి వారు మాట్లాడారు. ఇటీవల ఎల్కలపల్లి మాజీ సర్పంచ్ రాగం శ్రీనివాస్ యాదవ్ కుటుంబానికి జరిగిన సాంఘీక, సామాజిక బహిష్కరణను జిల్లా యాదవ సంఘం ఖండిస్తుందన్నారు. స్థానికంగా ఉండే ఓ వర్గం వారు ఈ శ్మశాన వాటిక తమకు మాత్రమేనని, ఎవరికీ అనుమతి లేదన్న విషయాన్ని గుర్తు చేశారు. పోలీసుల సహకారంతో ఖననం పూర్తయ్యిందన్నారు. బాధితుడు రాగం శ్రీనివాస్ యాదవ్ ఫిర్యాదు మేరకు అంత్యక్రియలను అడ్డకున్న వారిని అరెస్ట్ చేయాలని పోలీసులను కోరారు. గ్రామంలో 100 ఎకరాలకు పైగా ఆ వర్గం వారు ప్రభుత్వ స్థలాలను అక్రమించుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఇక్కడ గ్రామస్తులు మేకల కొమురయ్య, బక్కతట్ల కుమార్, పల్లె శ్రీనివాస్, రాజమణి, వినోద్, మల్లెత్తుల నాగరాజు, ఐలన్న, పెద్ద కొమురయ్య, అర్కుటి కొమురయ్య, వరుణ్, సతీశ్ ఉన్నారు.

సాయం అందజేస్తున్న వీహెచ్ఆర్ ఫౌండేషన్ సభ్యులు

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి సాయం

కోల్‌సిటీ, జనవరి 19::గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బండారి సంతోష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతని కుటుంబానికి అండగా ఉంటామని వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ నాయకులు వ్యాళ్ల హరీశ్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. సంతోష్ పిల్లల చదువు కోసం రూ.30వేలు వీహెచ్ఆర్ ఫౌండేషన్ తరపున బీఆర్ఎస్ 40వ డివిజన్ అధ్యక్షుడు చల్ల రవీందర్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్ఆర్ ప్రతినిధులు సిగిరి తిరుపతి, సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ అనిల్

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- ట్రాఫిక్ సీఐ అనిల్

పెద్దపల్లి, జనవరి19: రోడ్డు ప్రమాదాలు నియంత్రణకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ట్రాఫిక్ సీఐ అనిల్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో పెద్దపల్లి హమాలీ కార్మిక సంఘం భవనంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్, రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ వినియోగం, సీటు బెల్టు, వాహన డ్రువీకరణ పత్రాల ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. అతివేగంగా, అజాగ్రత్తగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని సూచించారు. ఎవరైనా రోడ్డు ప్రమాదాల బారిన పడితే 108కి అందించాలని, బాధితులను సమీపంలోని హాస్పిటల్‌కు తరలించడంలో సహాయపడాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ రవికాంత్, రైల్వే హమాలీ సంఘం నాయకుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

ముత్తారం, జనవరి 19: రైతు సంక్షేమ సేవా సంఘం కార్యవర్గంలో మండలం నుంచి ఇద్దరికి చోటు లభించింది. రైతు సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన మొగిలి కిరణ్ యాదవ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన చిగురు విద్యాసాగర్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. తమకు బాధ్యతలు అప్పగించిన వ్యవస్థాపక అధ్యక్షుడికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి ప్రజావాణి రద్దు

పెద్దపల్లి, జనవరి 19: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం (ఈ నెల 20న) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావద్దని విజ్ఞప్తి చేశారు. ఈనెల 26న అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించి సర్వే కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు ప్రకటించారు.

ఎన్టీపీసీలో వాలీబాల్ టోర్నమెంట్

జ్యోతినగర్, జనవరి 19: తెలంగాణ స్పోర్ట్స్ క్లబ్ ఎన్టీపీసీ రామగుండం ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలను రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్ ప్రారంభించారు. 19 జట్లు బరిలో నిలిచి తలపడ్డాయి. తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఇక్కడ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు ఆర్ ఉపేందర్, హెచ్ రమేశ్, వెంకట్రావ్, మునీందర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, జీ శంకర్, రవికృష్ణ, హరికుమార్, చెప్యాల రామారావు ఉన్నారు.

విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న నాయకులు

జూలపల్లి, జనవరి 19 : ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'లక్ష డప్పులు-వెయ్యి గొంతుకలు' మహా ప్రదర్శన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. జూలపల్లిలో ఆదివారం సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేపట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి సిరిసిల్ల శంకర్, ఉపాధ్యక్షుడు తాండ్ర శ్రీనివాస్, నాయకులు కల్వల మల్లేశం, నెరువట్ల రామస్వామి, సీపెల్లి అంజయ్య, కల్లపెల్లి రాజఎల్లయ్య, మల్లారపు వీరేశం, కల్లపెల్లి లింగయ్య, ఏదుల్ల కనకయ్య పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

జూలపల్లి, జనవరి 19 : పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, మల్టీపర్పస్ వర్క్ విధానం రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీపెల్లి రవీందర్ డిమాండ్ చేశారు. జూలపల్లిలో ఆదివారం ఆ సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చి తీరాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 12,700 పంచాయతీల్లో 60 వేల మంది సిబ్బంది వెట్టి చాకిరి చేస్తున్నారని పేర్కొన్నారు. నిబంధన పేరుతో కార్మికులపై ఒత్తిడి పెంచి బలవంతంగా పనులు చేయిస్తున్నారనీ, ఇతర పనులపై కొంతమందికి నైపుణ్యం లేక ప్రమాదాలకు గురైనట్లు పేర్కొన్నారు. ఇక్కడ మండ గౌరవాధ్యక్షుడు ఆసంపెల్లి బాణయ్య, ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల నాగేశ్వర్, నాయకులు చిప్ప సత్యం, రాంచందర్, బండారి రాజయ్య, నాగయ్య, లచ్చయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామ సభలు

కాల్వశ్రీరాంపూర్, జనవరి19: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పథకాలకు లబ్ధిదారులకు ఎంపిక కోసం మండలంలోని ఆయా గ్రామాల్లో ఈనెల 21నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామ్మోహనాచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఆశన్నపల్లె, ఆరెపల్లె, పందిల్ల, తారుపల్లి, కిష్టంపేట, ఇద్లాపూర్, పెగడపల్లి, కూనారం, 22న మడిపల్లి, పెద్దంపేట, కిష్టంపేట, లక్ష్మీపురం, పెద్దరాత్‌పల్లి, జాఫర్‌ఖాన్‌పేట, మొట్లపల్లి, కాల్వశ్రీరాంపూర్, వెన్నంపల్లి, 23న అంకంపల్లి, చిన్నరాత్‌పల్లి, మంగపేట, గంగారం, ఇప్పలపల్లి, మల్యాల, మడిపల్లి కాలనీ గ్రామాల్లో సభలు ఉంటాయని వివరించారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

గోదావరిఖని, జనవరి 19: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ బీఎంఎస్ కృషి చేయనున్నట్లు బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ ట్రస్టుబోర్డు మెంబర్ కొత్తకాపు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మార్కండయకాలనీలోని విశ్వహిందూ పరిషత్ భవన్‌లో జరిగిన కోల్‌మైన్ కార్మిక సంఘ్ కేంద్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన బొగ్గు గనుల ఏర్పాటు, కోల్ ఇండియా మాదిరిగా ఆదాయం పన్ను రీయింబర్స్‌మెంట్ చెల్లింపు, మెరుగైన సూపర్ స్పెషాలిటీ దవాఖాన, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. యూనియన్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో అఖిల భారతీయ కథాన్ మజ్దూర్ సంఘ్ బీఎంఎస్ జాతీయ కార్యవర్గ సభ్యులు మండ రమాకాంత్, పులి రాజారెడ్డి, ఎస్సీఎంకేఎస్ ప్రధానకార్యదర్శి ఎతిపతి సారంగపాణి, నాయకులు ఉన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

ముత్తారం, జనవరి 19: మండలంలోని అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని ఎంపీడీవో సురేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జారీ చేసిన జాబితాతో పాటు అదనపు జాబితా కూడా వచ్చిందని పేర్కొన్నారు. మొదటి జాబితాలో రాని వారు కొత్తగా అర్జీ సమర్పించాలని తెలిపారు. వారికి కూడా రేషన్ కార్డులు జారీ మంజూరవుతాయని వివరించారు.

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE AT MANTHANI
O.S. No. 55 of 2023
Between:
Naradabhatla Savithri ...Plaintiff.
AND
Allam Ramaswamy & another ...Defendants
To
1. Allam Ramaswamy S/o Narsingam, 69 yrs, Occ: Retd. Employee, R/o Manthani town of Peddapalli District
2. Devi Srikanth S/o. Mallaiah, 44yrs, Occ: Private Employee, R/o. Plot no. 304, Sampurna Towers, Vivekananda Colony, Kukatpalli, Hyderabad
Defendant no.1&2
NOTICE
Whereas the above named Plaintiff have filed suit for declaration and recovery of possession in respect of land in Sy. No. 850/A, adm Ac. 1.28 gts situated at Manthani village shivar & Mandal, Dist: Peddapalli against you.
That the said case is posted on 20.01.2025 for your appearance at 10.30 A.M before the said court. Therefore you are hereby directed to appear before the said court along with documents to claim your defense if any. Otherwise the matter will be decided ex-parte against you.
"By Order of the Court"
Sd/- KVLN Hari Babu & B. ANJANEYULU, Advocates
Manthani. Cell: 9014222255

'సమానత్వం కోసమే భారత రాజ్యాంగం'

మహనీయులకు నివాళులర్పిస్తున్న నాయకులు

కోల్‌సిటీ, జనవరి 19: దేశ ప్రజల సమానత్వం కోసమే నాడు అంబేద్కర్ భారత రాజ్యాంగంను రాశారని రామగుండం మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, 28వ డివిజన్ కార్పొరేట్ ఇంజపురి పులెందర్ అన్నారు. రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు గడుస్తున్నా పూర్తి స్థాయిలో రాజ్యాంగ ఫలాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, ఆలయ ఫౌండేషన్, తెలంగాణ అంమేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో గోదావరిఖనిలో పూలే-అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమం చేపట్టారు. మహనీయుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళుర్పించి మాట్లాడారు. అంబేద్కర్ కృషి ఫలితమే నేడు అన్ని వర్గాలకు ఫలాలు అందుతున్నాయన్నారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, ఆలయ ఫౌండేషన్ డిప్యూటీ సీఈవో మిట్టపల్లి రాజేంద్రకుమార్, నాయకులు మైస రాజేశ్, పులి మోహన్, గొర్రె రమేశ్, మహేశ్, వీర య్య, వెంకటేశ్వర్లు, కొంకటి లక్ష్మణ్, మంతెన లింగయ్య, కిష్టయ్య, రాజారత్నం, కరీం, శనిగరపు చంద్రశేఖర్, కాసిపాక రాజమౌళి పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ పులేందర్‌ను సన్మానించి పూలే, అంబేద్కర్ చిత్రపటాలు బహూకరించారు.

ఆత్మీయ సమ్మేళనాలతో మరింత అనుబంధం

పూర్వ విద్యార్థులతో ఎమ్మెల్యే విజయ రమణారావు

సుల్తానాబాద్ రూరల్, జనవరి 19: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలతో అనుబంధాలు బలపడుతాయని, స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. బొంతకుంటపల్లిలోని విజయ ఏసీ గార్డెన్‌లో ఆదివారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 1981-82 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇదే బ్యాచ్‌కు చెందిన ఎమ్మెల్యే విజయ రమణ రావు ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. చాలా ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా కలిసి సమ్మేళనం ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఆత్మీయ సమ్మేళనం నిర్వహణలో కీలక పాత్ర పోషించిన ఆహ్వాన కమిటీ ప్రతినిధులు మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ-రాజమల్లు, పారుపెల్లి వెంకట ఉమాపతి, వాసుదేవ రెడ్డి, అమిరిశెట్టి తిరుపతి, సీ తిరుపతి, బిరుదు సంజీవ్‌లను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ సమత-కృష్ణ, ఆహ్వాన కమిటి ప్రతినిధులు ఉన్నారు.